జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 167 గురువారం 13 నవంబర్- 2025 పేజీలు : 4 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

### భూటాన్ నుంచి నేరుగా ఆసుపత్రికి ప్రధాని మోదీ...

## ఎర్రకోట పేలుడు బాధితులకు పరామర్శ



**భూటాన్ పర్యటన ముగించుకుని తిరిగొచ్చిన ప్రధాని మోదీ**

**ఢిల్లీలోని లోక్ నాయక్ జైప్రకాశ్ ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడిన వైనం**

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

భూటాన్ (సందేశం టైమ్స్) : భూటాన్ పర్యటన ముగించుకుని నేడు దేశానికి తిరిగి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విమానాశ్రయం నుంచి నేరుగా ఢిల్లీలోని లోక్‌నాయక్ జై ప్రకాశ్ నారాయణ్ ఆసుపత్రికి వెళ్లారు. ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడులో గాయపడి అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. రెండు రోజుల భూటాన్ పర్యటన అనంతరం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకున్న ప్రధాని, ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన వివరాలను, బాధితులకు అందుతున్న వైద్యాన్ని గురించి వైద్యులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు భూటాన్ పర్యటనలో ఉండగానే ప్రధాని మోదీ ఢిల్లీ పేలుడు ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. "ఢిల్లీలో ఒక విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆప్తులను కోల్పోయిన కుటుంబాల బాధను నేను అర్థం చేసుకోగలను. ఎంతో భారమైన హృదయంతో ఇక్కడికి వచ్చాను. ఈ దుఃఖ సమయంలో దేశం మొత్తం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుంది. మన ఏజెన్సీలు ఈ ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తాయి. బాధ్యులైన వారందరినీ చట్టం ముందు నిలబెడతాం" అని భూటాన్ రాజధాని థింపులో ప్రధాని వ్యాఖ్యానించారు.

### 200 ఐఈడీ బాంబులతో

## దేశవ్యాప్తంగా పేలుళ్లు...

## ఉగ్రవాదుల కుట్ర!

**ఢిల్లీ ఎర్రకోట పేలుడు కేసులో సంచలన విషయాలు**

26/11 తరహాలో భారీ దాడులకు ఉగ్రవాదుల కుట్ర

200 శక్తిమంతమైన ఐఈడీ బాంబులు సిద్ధం చేసేందుకు ప్లాన్

కుట్ర వెనుక పాక్ ఉగ్రసంస్థ జైషే మహ్మద్ హస్తం

ఇప్పటికే 2900 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం

కేసు దర్యాప్తు చేపట్టిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)

మిగతా 2లో...



### సమాజాభివృద్ధిలో

## మహిళల పాత్ర కీలకం



**అమ్మాయిలు ఎక్కువ పతకాలు సాధించడం గర్వకారణం: గవర్నర్ అబ్దుల్ నజీర్**

**రాయలసీమ విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ .**

**విద్యారంగ ప్రగతిపై ప్రశంసలు**

కర్నూలు (సందేశం టైమ్స్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ రాయలసీమ విశ్వవిద్యాలయం నాలుగో స్నాతకోత్సవంలో పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

మిగతా 2లో...

**2029 నాటికి పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని వెల్లడి**

**గృహ నిర్మాణానికి ముస్లింలకు రూ.50 వేల అదనపు సాయం ప్రకటన**

**గత ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ.900 కోట్ల బిల్లులను చెల్లిస్తామని హామీ**

**ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుతో మహిళలకు ప్రోత్సాహం**

**ఉగాది నాటికి రాష్ట్రవ్యాప్తంగా మరో 5.9 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు**

**ఇంటింటికీ సోలార్ విద్యుత్, ఇంటర్నెట్ అందిస్తామన్న ముఖ్యమంత్రి**

### గృహ నిర్మాణ రంగాన్ని

## కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారు:

## సీఎం చంద్రబాబు

### అన్నమయ్య జిల్లా రాయచోటిలో 'ప్రజావేదిక' కార్యక్రమం

అన్నమయ్య జిల్లా, (సందేశం టైమ్స్): రాష్ట్రంలో 2029 నాటికి ఇల్లు లేని నిరుపేద అనేవారే ఉండకూడదని, ప్రతి ఒక్కరికీ సొంతిల్లు నిర్మించి ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదని, అదొక గౌరవం, భద్రత, భవిష్యత్తుకు చిరునామా అని ఆయన అభివర్ణించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో బుధవారం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించిన అనంతరం ఏర్పాటు చేసిన ఈ సభలో ఆయన కీలక ప్రకటనలు చేశారు.

మిగతా 2లో...



### ధర్మవరంలో

## జనసేనలో చేరిన 100 కుటుంబాలు

**జనసేనలోకి డ్వాక్రా సంఘాల సభ్యులు**



**పవన్ కల్యాణ్ సిద్ధాంతాలే చేరికకు కారణమన్న సభ్యులు**

**పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన చిలకం మధుసూదన్ రెడ్డి**

2 లో

## గుంటూరులో ఉద్రిక్తత...

### పోలీసులతో అంబటి రాంబాబు వాగ్వాదం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరిస్తున్నారంటూ వైసీపీ ఆందోళనలు.. గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు ర్యాలీకి అడ్డంకి.. అంబటి, పట్టాభిపురం సీఐ మధ్య తీవ్ర వాగ్వాదం సీఐ తీరుపై మండిపడిన అంబటి.. లోకేశ్ బంధువంటూ ఆరోపణ.ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు ప్రైవేటీకరణ ఆపే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం

2 లో

### అమీర్‌పేట కోచింగ్ సెంటర్లు

## 3 నెలల శిక్షణతోనే అవకాశాలు కల్పిస్తున్నాయి:

## మంత్రి నారా లోకేశ్

**అమరావతిలో 'హయ్యర్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్ - 2025'**

**ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేశ్**

**భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడమే లక్ష్యమని వెల్లడిఉన్నత విద్యారంగంలో సంస్కరణలు అత్యవసరని**

**ఉద్ఘాటన నైపుణ్యాల కొరతను అధిగమించేందుకు స్కిల్ సెన్సస్**



(సందేశం టైమ్స్) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో భారతదేశం త్వరలోనే 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని, అయితే మన అసలైన లక్ష్యం దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమేనని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు

2 లో

### డ్రగ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు..

**హోంమంత్రి అనిత స్ట్రాంగ్ వార్నింగ్**



అనకాపల్లి (సందేశం టైమ్స్) : తమ ప్రభుత్వంలో గంజాయిపై ఉక్కుపాదం మోపామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వంలో ఈగల్ అనే ఒక వ్యవస్థను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

మిగతా 2లో...

మొదటి పేజీ తరువాయి

## 200 ఐఈడీ బాంబులతో దేశవ్యాప్తంగా పేలుళ్లు... ఉగ్రవాదుల కుట్ర!

దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటన దర్యాప్తులో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఇది కేవలం ఒక్క చోటుకే పరిమితమైన దాడి కాదని, 26/11 ముంబయి తరహాలో దేశవ్యాప్తంగా వరుస పేలుళ్లతో విధ్వంసం సృష్టించేందుకు ఉగ్రవాదులు భారీ కుట్ర పన్నినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం అత్యంత శక్తిమంతమైన 200 ఐఈడీ (ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్) బాంబులను సిద్ధం చేసే పనిలో ఉగ్రవాదులు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఉగ్రవాదుల టార్గెట్ లిస్టులో ఎర్రకోటతో పాటు ఇండియా గేట్, కాన్‌స్టిట్యూషన్ క్లబ్, గౌరీశంకర్ ఆలయం వంటి కీలక ప్రాంతాలు ఉన్నాయి. వీటితో పాటు దేశవ్యాప్తంగా పలు రైల్వేస్టేషన్లు, రద్దీగా ఉండే షాపింగ్ మాల్స్‌లోనూ విధ్వంసం సృష్టించాలని పథకం రచించారు. జనవరి నుంచే ఈ కుట్రకు ప్రణాళికలు జరుగుతున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ కుట్ర వెనుక పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ హస్తం ఉందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ దాడుల కోసం పనిచేస్తున్న 'వైద్యుల టెర్రర్ మాడ్యూల్' గుట్టును అధికారులు రట్టు చేస్తున్నారు. ఇటీవలే జమ్మూకశ్మీర్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్‌లలో కేంద్ర ఏజెన్సీలు నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్‌తో కూడిన 2,900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం ఈ కుట్ర తీవ్రతకు అద్దం పడుతోంది.

## గుంటూరులో ఉద్రిక్తత...



ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తున్నారంటూ వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా గుంటూరులో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ మంత్రి అంబటి రాంబాబు నేతృత్వంలో తలపెట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో ఆయనకు, స్థానిక సీఐకి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసుల తీరును నిరసిస్తూ వైసీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. వైసీపీ ఇచ్చిన పిలుపు మేరకు, బుధవారం నాడు అంబటి రాంబాబు గుంటూరులోని తన నివాసం నుంచి ర్యాలీ ప్రారంభించారు. స్వామి థియేటర్ వద్దకు చేరుకోగానే, పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ర్యాలీని నిలువరించారు. ఈ క్రమంలో అంబటి రాంబాబుకు, పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లుకు మధ్య మాటామాటా పెరిగింది. సీఐ తనతో దురుసుగా ప్రవర్తిస్తూ, వేలు చూపిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారని అంబటి ఆరోపించారు. గతంలో కూడా ఇదే అధికారి తన పట్ల ఇలాగే ప్రవర్తించారని ఆయన పేర్కొన్నారు.

## డ్రగ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు..

పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి మత్తులో యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని మార్గనిర్దేశం చేశారు. ఇవాళ(బుధవారం) అనకాపల్లి జిల్లా వేదికగా ప్రసంగించారు హోంమంత్రి వంగలపూడి అనిత.'మన భవిష్యత్ – మన చేతుల్లోనే ఉంది'. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం విశాఖపట్నం రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని చెప్పుకొచ్చారు. యువత భవిష్యత్ చాలా ముఖ్యమని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ఎన్డీపీఎస్ యాక్ట్ కఠినంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీస్ శాఖ ఎంతో కృషి చేస్తోందని ప్రశంసించారు. డ్రగ్స్‌పై ఏపీలో నిఘా పెరిగిందని.. కఠినతరమైన శిక్షలు, చట్టాలు ఉన్నాయని హెచ్చరించారు. గంజాయి రవాణా చేసిన, గంజాయి సేవిస్తున్నా వెంటనే 1972 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. సమాచారం అందగానే పోలీసులు వస్తారని, చట్టపరంగా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు హోంమంత్రి వంగలపూడి అనిత.

## గృహ నిర్మాణ రంగాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారు: సీఎం చంద్రబాబు

గత పాలనపై తీవ్ర విమర్శలు

గత ఐదేళ్ల పాలనలో గృహ నిర్మాణ రంగాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారని చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. పేదలకు ఇళ్లు కట్టిస్తామని చెప్పి మాట నిలబెట్టుకోలేకపోగా, కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని ఆరోపించారు. "తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం వరకు దేశంలో ఏ ప్రభుత్వం కూడా పేదలకు పక్కా ఇళ్లు కట్టించలేదు. గుడిసెలు గాలొస్తే కొట్టుకుపోయేవి. కానీ పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలని ఆలోచించిన మహానుభావుడు ఎన్టీఆర్. కూడు, గూడు, గుడ్డ నినాదంతోనే టీడీపీ పుట్టింది. మేం 2014–19 మధ్య 8 లక్షల ఇళ్లు కట్టిస్తే, గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4.73 లక్షల ఇళ్లను రద్దు చేసింది. సొంతంగా ఇల్లు కట్టుకున్న 2.73 లక్షల మందికి ఇవ్వాల్సిన రూ.900 కోట్లు ఎగ్గొట్టారు. ఆ బకాయిలను మా ప్రభుత్వం చెల్లిస్తుంది" అని హామీ ఇచ్చారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు తాము ఇస్తే, గత పాలకులు పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలం ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అవి కూడా ఊరికి దూరంగా కొండలు, గుట్టల్లో ఇచ్చి వదును పేరుతో కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. పేదలకు ఉచితంగా ఇవ్వాల్సిన ఇసుకను కూడా పందికొక్కుల్లా తిన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## నామకరణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 12: శంకరంపేట్ (ఆ) మండలం జుక్కల్ గ్రామానికి చెందిన కళాలి భాస్కర్ గౌడ్ కూతురి కొడుకు నామకరణ మహోత్సవం అల్లాదుర్గంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నామకరణ మహోత్సవానికి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే శ్రీ మహా రెడ్డి భూపాల్ రెడ్డి విచ్చేసి శిశువు చిరంజీవి రిహాన్‌ను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు మహా రెడ్డి రోషన్ రెడ్డి, కళాలి భాస్కర్ గౌడ్, వారి బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ధర్మవరంలో జనసేనలో చేరిన 100 కుటుంబాలు

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు ఆకర్షితులై ధర్మవరం పట్టణంలో పలువురు ఆ పార్టీలో చేరారు. పట్టణంలోని 36వ వార్డు కొత్తపేట, శాంతినగర్‌కు చెందిన డ్వాక్రా సంఘాల సభ్యులు, మహిళలు సహా సుమారు 100 కుటుంబాలు బుధవారం జనసేన తీర్థం పుచ్చుకున్నాయి. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు కోటిరెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీపై నమ్మకంతో చేరిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జనసేన పార్టీ కేవలం ఒక రాజకీయ వేదిక కాదని, ప్రజల ఆశలు, ఆశయాలకు ప్రతీక అని ఆయన అన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తాను నిరంతరం అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. "కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా, ఏ సమస్య ఎదురైనా నేను ముందుండి పరిష్కరిస్తాను. నేను నిరంతరం మీకు అందుబాటులో ఉంటాను" అని మధుసూదన్ రెడ్డి హామీ ఇచ్చారు. పార్టీలో కొత్తగా చేరిన సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జోగిపేటలో వృద్ధురాలి మెడలోని బంగారు చైన్ ఎత్తుకెళ్లిన దుండగుడు

■ కారం చల్లి అపహరణ ■ పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి %-% నవంబర్ 12: జోగిపేట పట్టణంలో దుండగుడు ఓ వృద్ధురాలిపై దాడి చేసి బంగారు చైన్ దోచుకెళ్లిన ఘటన కలకలం రేపింది. వివరాల ప్రకారం, అందోలు%-%జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని సత్యసాయి కాలనీలో నివాసం ఉంటున్న శంకరంపేటకు చెందిన మానెమ్మ అనే వృద్ధురాలు తన కూతురు వెంకటలక్ష్మి ఇంట్లో నివసిస్తోంది. బుధవారం మధ్యాహ్నం తల్లి%-%కూతుళ్లు ఇంట్లో ఉన్న సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి, వృద్ధురాలి కంట్లో కారం చల్లి, ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు చైన్ ఎత్తుకెళ్లాడు. అడ్డుకునే ప్రయత్నం చేసిన బాధితులను తప్పించుకుని దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటన తెలిసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సూచన మేరకు జోగిపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, సీఐ అనిల్‌కుమార్, ఎస్సై పాండు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. దుండగుడిని గుర్తించేందుకు పోలీసులు పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

## అమీర్‌పేట కోచింగ్ సెంటర్లు 3 నెలల శిక్షణతోనే ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి:మంత్రి నారా లోకేశ్

ఈ బృహత్తర లక్ష్యాన్ని వేగంగా చేరుకోవాలంటే విద్యారంగంలో సమూలమైన సంస్కరణలు తీసుకురావడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. అమరావతిలో సీఐఐ సదరన్ రీజియన్, విట్-ఏపీ సంయుక్తంగా నిర్వహించిన 'హయ్యర్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్ %-% 2025'కు లోకేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 'భారతదేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ఉన్నత విద్యను పునఃరూపకల్పన చేయడం' అనే థీమ్‌తో ఈ సదస్సును ఏర్పాటు చేశారని, అయితే తాను ఈ అంశంతో పూర్తిగా ఏకీభవించడం లేదని లోకేశ్ అన్నారు. "5 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం మనకు అత్యంత సమీపంలో ఉంది. దానిని మనం సులభంగానే చేరుకుంటాం. కానీ, అసలు ప్రశ్న 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎలా ఎదగాలన్నదే. మానవ వనరులు, మేధోసంపద లేకుండా ఇంతటి ఆర్థికవృద్ధి అసాధ్యం. ఈ మహోన్నత లక్ష్య సాధనలో మన ఉన్నత విద్యారంగమే వ్యూహాత్మక మూలస్తంభంలా పనిచేయాలి" అని ఆయన దిశానిర్దేశం చేశారు.

## సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ఎక్కువ బంగారు పతకాలు సాధించడం సంతోషకరమైన అంశం, గర్వకారణమని పేర్కొన్నారు. విద్యారంగంలో మహిళల ముందడుగు సమాజ అభివృద్ధికి సంకేతమన్నారు.

విద్య ఉపాధి సాధనమే కాక, సేవకు పునాది..

గవర్నర్ అబ్దుల్ నజీర్ (%శ్రీ%ఎ.ఐబ్రీ శ్రీ%వతీ%) విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్య కేవలం ఉపాధి సాధనమేకాక, సమాజ సేవకు పునాదిగా ఉండాలన్నారు. చదువుతో పాటు విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రాయలసీమ యూనివర్సిటీ విద్యా ప్రమాణాలు నిరంతరం మెరుగుపడుతున్నాయని ఆయన అభినందించారు. అనంతరం యూనివర్సిటీలో 75 మందికి పట్టాలు, బంగారు పతకాలు ప్రదానం చేశారు.

## అమ్మవారి ఆలయ శుద్ధి



తిరుచానూరు, నవంబరు12సందేశం టైమ్స్: తిరుచానూరులో ఈనెల 17న ప్రారంభం కానున్న పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించారు. ఉదయం 6 నుంచి 9గంటల వరకు అధికారులు, అర్చకులు, సిబ్బంది ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలతో కలగలిపిన పవిత్రజలాన్ని ప్రోక్షణం చేశారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా మూడవ మహాసభలకు ఏర్పాట్లు జోరుగా

## జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ పిలుపు



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 12నవంబర్: సంగారెడ్డి పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఈరోజు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ, కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా మూడవ మహాసభలు నవంబర్ 16వ తేదీన సంగారెడ్డి పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు.ఈ మహాసభలకు రాష్ట్ర స్థాయి నాయకులు, గౌడ ప్రజా ప్రతినిధులు, మేధావులు హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా కల్లుగీత వృత్తి రక్షణ, కార్మికుల ఉపాధి, గౌడ కులస్తుల సంక్షేమం వంటి అంశాలపై విస్తృత చర్చ జరగనుందని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం గౌడ కులస్తులకు ఇచ్చిన హామీల అమలు కోసం భవిష్యత్తు ఉద్యమ ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు.మహాసభల సందర్భంలో సంగారెడ్డి పట్టణంలో భారీ ప్రదర్శన కూడా నిర్వహించనున్నామని ఆయన చెప్పారు."ఇంటికో మనిషి %-% ఊరుకో బండి %-% సంగారెడ్డికి రావాలి!" అంటూ జిల్లా గౌడ సోదరులు, కల్లుగీత కార్మికులు, సొసైటీల అధ్యక్షులు, %ఖీ% సభ్యులు అందరూ మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు అంజ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, కృష్ణ గౌడ్, రామా గౌడ్, భూమా గౌడ్, యాద గౌడ్, వెంకటేశం గౌడ్, సత్యనారాయణ గౌడ్, చేన్న గౌడ్, నవీన్ గౌడ్, రవి గౌడ్

# 50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో ములుగు ఎస్సై, కానిస్టేబుల్




సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి - నవంబర్ 12: ప్రభుత్వ డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అక్రమంగా కబ్జా చేసిన కేసులో న్యాయం చేయాలంటే లంచం ఇవ్వాలని డిమాండ్ చేసిన ములుగు పోలీస్ స్టేషన్ ఎస్సై, కానిస్టేబుల్ ఏసీబీ ఉచ్చులో చిక్కారు.వివరాల ప్రకారం, ములుగు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై విజయ్‌కుమార్, కానిస్టేబుల్ రాజులు బాధితులపై ఒత్తిడి తెచ్చి లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. బాధితులు ప్రభుత్వ డబుల్ బెడ్‌రూం ఇల్లుపై ఇతరులు అక్రమంగా కబ్జా చేయడంతో కోర్టును ఆశ్రయించగా, కోర్టు వారి పక్షాన తీర్పు ఇచ్చింది. ఆ ఆదేశాల కాపీని ఎస్సై విజయ్‌కుమార్‌కు అందజేసి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.అయితే, ఆ ఇంటిని అప్పగించాలంటే రూ.1 లక్ష లంచం ఇవ్వాలని ఎస్సై డిమాండ్ చేశాడు. బాధితులు ఆ మొత్తాన్ని ఇవ్వలేకపోవడంతో రూ.50 వేల రూపాయలకు ఒప్పుకున్నారు. వెంటనే వారు ఏసీబీ అధికారులను సమాచారం అందించారు.ఏసీబీ ఏర్పాటు చేసిన ఉచ్చులో మంగళవారం సాయంత్రం కానిస్టేబుల్ రాజు బాధితుల నుంచి రూ.50,000 లంచం స్వీకరిస్తున్న సమయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.తదుపరి విచారణ అనంతరం ఎస్సై విజయ్‌కుమార్, కానిస్టేబుల్ రాజులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు.

# కోదాడ విద్యార్థుల కరాటే సత్తా:

## జాతీయస్థాయిలో 7 బంగారు, 4 రజత పతకాలు సాధన!




కోదాడ, సూర్యాపేట జిల్లా: మార్షల్ ఆర్ట్స్ రంగంలో కోదాడ పట్టణం విద్యార్థులు మరోసారి ప్రతిభ చాటారు. ఈ నెల 9వ తేదీ ఆదివారం నాడు దేవరకొండలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో ఆయుష్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో, కోదాడ శ్రీ చైతన్య స్కూల్ ఆవరణలో శిక్షణ పొందుతున్న సూర్యాపేట జిల్లా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్‌కు చెందిన విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచి 7 బంగారు, 4 రజత పతకాలు సాధించారు.

**విజేతల వివరాలు:**

**విద్యార్థి పేరు కేటగిరీ / బెల్ట్ ఈవెంట్ స్థానం పతకం**

వేముల కరుణ్ కుమార్ సీనియర్ బ్లాక్ బెల్ట్ కటా ప్రథమ బంగారు,
పొక్కుల ప్రణీత్ సీనియర్ బ్లాక్ బెల్ట్ కుమిటి ప్రథమ బంగారు,
పొక్కుల రక్షిత్ - కుమిటి ప్రథమ బంగారు,
మొక్క అక్షయ పర్పుల్ బెల్ట్- ప్రథమ బంగారు,
తిరగమల్ల వేదశ్రీనిత్య- కటాప్రథమ బంగారు,
కంకిపాటి ఉద్దీతి- కటా ప్రథమ బంగారు,
మొక్క అక్షిత బ్లూ బెల్ట్‌కుమిటి ద్వితీయరజతం,
వేమ్మిరెడ్డి రువంతిక- కటా ద్వితీయ రజతం,
సంగిశెట్టి గిరీష్ కోమల్ -కటా ద్వితీయ రజతం,
శీలం వరుణ్ - కటా ద్వితీయ రజతం,

### మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రశంస

ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శెట్టి వెంకటేష్ గౌడ్ ,జనరల్ సెక్రటరీ కొండపల్లి , క్రాంతికుమార్ , ట్రెజరర్ సుల్తాని వెంకటేష్ విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.“ కోదాడ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి, వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిలబెట్టడం మా ప్రధాన లక్ష్యం. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో కూడా ఈ విద్యార్థులు రాణించాలనే ఆశయం ఉంది,” అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంగిశెట్టి రామకృష్ణ, శీలం శంకర్, స్వామి తదితరులు పాల్గొన్నారు. వారి ప్రోత్సాహం, మార్గదర్శకత వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు.

# తాలెల్మలో దొడ్డి కొమురయ్య విగ్రహం ప్రతిష్ఠించాలి

## మాజీ ఎంపీటీసీ దండు నాగభూషణం





చిత్రపటాన్ని తొలగించడం అమానుషం - కురుమ సంఘం అధ్యక్షుడు బోడోల్ల మల్లేశం

సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి %-% నవంబర్ 12: సంగారెడ్డి జిల్లా అందోలు మండలం తాలెల్మ గ్రామంలో తెలంగాణ తొలి దశ అమరవీరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కురుమ సంఘం నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు.తాలెల్మ గ్రామ కురుమ సంఘం కార్యాలయానికి సమీపంలోని ఖాళీ స్థలంలో దొడ్డి కొమురయ్య స్మారక చిహ్నం నిర్మించాలని సంఘం సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. ఆ నిర్ణయానికి అనుగుణంగా నవంబర్ 4, 2025న చిత్రపట ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో గ్రామపంచాయతీ సెక్రటరీ ఆ చిత్రపటాన్ని తొలగించారని తెలిపారు.ఈ చర్యను తీవ్రంగా ఖండించిన కురుమ సంఘం అధ్యక్షుడు బోడోల్ల మల్లేశం మాట్లాడుతూ %-% "స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీక అయిన దొడ్డి కొమురయ్య చిత్రపటాన్ని తొలగించడం అమానుషం. మా మనోభావాలను దెబ్బతీసే చర్య ఇది" అన్నారు.మాజీ ఎంపీటీసీ దండు నాగభూషణం మాట్లాడుతూ - "పంచాయతీ సెక్రటరీ తక్షణమే దొడ్డి కొమురయ్య చిత్రపటాన్ని తిరిగి ప్రతిష్ఠించి, ఆయన విగ్రహాన్ని అదే స్థలంలో ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం" అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు సాబాది రవి, గొర్ల కాపరుల సంఘం అధ్యక్షులు గడ్డమీది విట్టల్, మాజీ కురుమ సంఘం అధ్యక్షులు పడకంటి మల్లేశం, గూడెం కిష్టయ్య, పులకంటి మల్లేశం, బోడోల్ల యాదయ్య, రాజయపేట మల్లేశం, సాబాది శంకర్, దండు బీరప్ప, గడ్డమీది దశరథ, సాబాది యాదయ్య, దుర్గేష్, శివరాజు, సంతోష్, శివకుమార్, కృష్ణ, అశోక్, శంకర్, అంజయ్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం!

## రాజీపడడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో రాజీ పడవచ్చు జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

## ఎస్సై నవీన్ కుమార్




అనంతగిరి నవంబర్ 12 : (సందేశం టైమ్స్) రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో కక్షిదారులు రాజీపడవచ్చు క్షణికావేశంలో జరిగిన తప్పులను సరిదిద్దు కోవడానికి రాజీమార్గమే రాజమార్గం కనుక నవంబర్ 15న శనివారం జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని అనంతగిరి మండల ఎస్సై నవీన్ కుమార్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు.జాతీయ లోక్-అదాలత్ ను ఉద్దేశించి ఎస్సై నవీన్ కుమార్ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవాడానికి అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అని,అనవసర గొడవలకు,పట్టింపులకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని మండల వ్యాప్తంగా నమోదైన,చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో కక్షిదారులు రాజీ పడుటకు జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.రాజీపడదగిన కేసుల్లో ఇరువర్గాల మధ్య పరస్పర అవగాహనతో పరిష్కారం కనుక్కోవడం వల్ల సమయం,ధనం,శ్రమ ఆదావుతుందని తెలిపారు.రాజీ ద్వారా అందరికీ న్యాయం లభిస్తుందని పేర్కొన్నారు. కానిస్టేబుల్ నుండి అధికారుల వరకు ప్రతి ఒక్కరు భాధ్యతగా వ్యవహరించి,రాజీ పడదగిన కేసులలో ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి,వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ పడేలా చేసుకోవాలన్నారు.జాతీయ లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం జరుగుతుందని తెలిపారు.

# జాతీయ అవార్డుకు ఎంపికైన మురుగుమ్మి

ఒంగోలు కలెక్టరేట్,నవంబరు12 సందేశం టైమ్స్: డ్వామా నీటి సంరక్షణ పథకంలో జాతీయ ఉత్తమ పురస్కారానికి కనిగిరి నియోజకవర్గ పరిధిలోని మురుగుమ్మి గ్రామ పంచాయతీ ఎంపికైంది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో అక్కడి వాటర్ షెడ్, ఇతరశాఖల భాగస్వామ్యంతో ఉత్తమ నీటి యాజమాన్య విధానాలను పాటించారు. పలురకాలైన సహజ పద్ధతుల్లో వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలమట్టం పెంపొందించడంలో విజయం సాధించారు. కందకాల పనులు, చిన్న, పెద్ద ఊటకుంటలు, పాండ్స్, అమృత్ సరోవర్లు, పూడికతీత పనులు చేయడం ద్వారా సుమారు 8.21 లక్షల క్యూబిక్ మీటర్ల నీటిని నిల్వ చేశారు. అందుకోసం 51 పనులకు రూ.97 లక్షలు వెచ్చించారు. ఆయా పనులను కేంద్ర బృందం ఇటీవల తనిఖీలు చేసింది.

# నిజామాబాద్‌లో పెళ్లింట విషాదం



నిజామాబాద్,నవంబరు12(సందేశం టైమ్స్) : మరో రెండు రోజుల్లో ఓ యువకుడు పెళ్లి బంధంలో అడుగుపెట్టబోతున్నాడు. ఇంట్లో పెళ్లి పనులు కూడా జోరందుకున్నాయి. బంధువులు రావడం కూడా మొదలైంది. దీంతో ఇంట్లో పెళ్లి సందడి నెలకొంది. అంతా ఆనందంగా పెళ్లి రోజు కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. కానీ ఇంతలో ఆ యువకుడు చేసిన పనితో కుటుంబసభ్యులను శోకసంద్రంలోకి నెట్టేసింది. రెండే రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు తీసుకున్న నిర్ణయం పెళ్లింట విషాదాన్ని నింపింది. నిజామాబాద్ జిల్లాలో ఈ ఘటన జరిగింది.జిల్లాలోని ఎడపల్లి మండలం మంగల్పాడు గ్రామానికి చెందిన ప్రతాప్ గౌడ్ (30) పెళ్లి నిశ్చయమైంది. మరో రెండు రోజుల్లో అతడి వివాహం. కానీ ఏదో విషయంలో కుటుంబంలో గొడవలు చోటు చేసుకున్నాయి. అది చిలికి చిలికి గాలివానగా మారాయి. కుటుంబ తగాదాలతో ప్రతాప్ గౌడ్ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఎంతో సంతోషంగా పెళ్లి చేసుకోవాల్సిన ప్రతాప్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. టానా కలాన్ శివరులో చెట్టుకు ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుడి మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# లిఫ్టులో ఇరుక్కున్న జొమాటో డెలివరీ బాయ్



హైదరాబాద్:నవంబరు12 (సందేశం టైమ్స్) : ఫుడ్ డెలివరీ చేయడానికి వచ్చిన జొమాటో డెలివరీ బాయ్ రాత్రి ఓ అపార్టుమెంట్‌లోని లిఫ్టులో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు అతడిని కాపాడారు. చాదర్‌ఘాట్ సీఐ కేబీ మురారి తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ నివాసి చెరుకు మల్లె రాంబాబు జొమాటో డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నాడు. మలక్‌పేట ప్రొఫెసర్ కాలనీలోని ఓ రెసిడెన్సీలోని ఫ్లాట్‌లో ఫుడ్ డెలివరీ చేసేందుకు వచ్చాడు. %డెలివరీ చేసిన తర్వాత లిఫ్టులో కిందికి దిగేందుకు ప్రయత్నించగా లిఫ్టు ఆగిపోయింది. దీంతో ఆయన డయల్ 100కు కాల్ చేశాడు. సమాచారం అందుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది రంగంలోకి దిగారు. లిఫ్టు తలపులు పగలగొట్టి జొమాటో డెలివరీ బాయ్ రాంబాబును బయటికి తీశారు. పోలీసులకు రాంబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మూడు కోట్ల విలువైన వస్తువులు సీజ్.. విమానాశ్రయంలో కలకలం



హైదరాబాద్, నవంబరు12 (సందేశం టైమ్స్) : రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో (శంషాబాద్ ఎయిర్‌పోర్టు) కలకలం రేగింది. ఇద్దరు ప్రయాణికుల నుంచి భారీ మొత్తంలో ఎలక్ట్రానిక్ పరికరాలను సీఐఎస్ఎఫ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.3 కోట్లుగా గుర్తించారు. ఇద్దరు ప్రయాణికులను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కాగా.. ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిత్యం హడావుడిగా ఉంటుంది. విమానాశ్రయంలో భద్రత ఎంతో కట్టుదిట్టంగా ఉంటుంది. ప్రతీ ప్రయాణికుడిని, వస్తువులను క్షుణ్ణంగా పరిశీలిస్తుంటారు అధికారులు. ఈ క్రమంలో అబుదాబీ నుంచి ఇద్దరు ప్రయాణికులు వచ్చారు.అయితే వారు అనుమానంగా కనిపించడంతో వెంటనే సీఐఎస్ఎఫ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరి ప్రయాణికుల లగేజ్ బ్యాగ్‌లను తనిఖీలు చేయగా... మూడు కోట్ల విలువ చేసే డ్రోన్‌లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, ఐ ఫోన్‌లను గుర్తించారు. ఇంత పెద్ద మొత్తంలో ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావడంపై అధికారులు అనుమానం వ్యక్తం చేస్తూ ఇద్దరు ప్యాసింజర్స్‌ను అదుపులోకి తీసుకున్నారు.అలాగే ఎలక్ట్రానిక్ వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తులు సూర్య ప్రకాష్, మహమ్మద్ జాంగిర్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసిన విమానాశ్రయ పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. అసలు ఎలక్ట్రానిక్ వస్తువులను ఎందుకు తీసుకువచ్చారు?.. ఎలా తీసుకువచ్చారు?.. ఎక్కడికి తీసుకెళ్తున్నారు అనే దానిపై ఎయిర్‌పోర్టు అధికారులు ఆరా తీసే పనిలో ఉన్నారు.

# వాహనం బోల్తా పడి విద్యార్థులకు తీవ్ర గాయాలు



నాగర్‌కర్నూల్/పెద్దకొత్తపల్లి, నవంబరు12 (సందేశం టైమ్స్) : పాఠ్యపుస్తకాలను తరలిస్తున్న బొలేరో వాహనం బోల్తా పడి నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. సాతాపూర్ జిల్లా ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం ఆదేశాల మేరకు పుస్తకాలను తరలించడానికి పెద్దకొత్తపల్లిలోని మండల విద్యా వనరుల కేంద్రానికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో జొన్నల బొగడ–బాచారం బస్సు స్టేజీ మధ్య వారు ప్రయాణిస్తున్న వాహనం బోల్తా పడగా, అందు లో ఉన్న నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. శివ అనే విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. మిగతావారిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులతో పనులు చేయిస్తూ ప్రమాదానికి కారణమైన ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలంను సస్పెండ్ చేసినట్లు డీఈవో రమేషకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# వేములవాడ ఆలయంలో దర్శనాల నిలిపివేత.. భక్తుల ఆగ్రహం




రాజన్న సిరిసిల్ల, నవంబరు12 (సందేశం టైమ్స్) : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం లో భక్తుల దర్శనాలను నిలిపివేశారు. ఆలయ అధికారులు ముందస్తు ప్రకటన లేకుండా దర్శనాలు నిలిపివేయడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం ఎదుట స్వామివారి దర్శనం కోసం ఇవాళ(బుధవారం) తెల్లవారుజామున భక్తులు నిరీక్షించారు. ఆలయ ప్రధాన గేటుకు కూడా అధికారులు తాళం వేయడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన గేటు నుంచి ఆలయం లోపలికి వెళ్లకుండా అడ్డంగా రేకులు ఏర్పాటు చేశారు అధికారులు. ఈ నేపథ్యంలో భక్తులు ఆలయం ఎదుట ఆందోళనకు దిగారు.అయితే, రాజన్న ఆలయం ఎదుట ప్రచార రథంపై స్వామివారి దర్శనం కల్పించారు. ఎల్ఈడీ తెరపై స్వామివారి దర్శనం భక్తులకు కల్పించేలా ఏర్పాట్లు చేశారు. ఆలయ విస్తరణలో భాగంగా ఇప్పటికే భీమేశ్వరాలయంలో భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నారు రాజరాజేశ్వరస్వామి స్వామి ఆలయ అధికారులు. ఎంతో దూరం నుంచి వచ్చి స్వామివారికి మొక్కు చెల్లిందమని వస్తే ఆలయ అధికారులు ఇలా చేయడం భావ్యం కాదని భక్తులు మండిపడుతున్నారు. ఇంత చలిలోనూ స్వామివారి దర్శనం కోసం వేచి చూస్తున్నామని.. అయినా అధికారులు కనికరించడం లేదని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# భద్రాద్రిలో జై శ్రీరామ్ ఇటుకలు




భద్రాచలం, నవంబరు12 (సందేశం టైమ్స్) :దక్షిణ అయోధ్య భద్రాచలంలో 'జై శ్రీరామ్' నామం అచ్చు కలిగిన ఇటుకల తయారీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం బెంగళూరు నుంచి ప్రత్యేకంగా మోల్డ్‌లను తెప్పించారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆ మోల్డ్‌లను పరిశీలించి నమూనా ఇటుకలను భక్తులతో తయారు చేయించారు. శ్రీరాముడి దర్శనానికి వచ్చే భక్తుల్లో ఆసక్తి కలిగిన వారితో, ఇటుకలను కొనుగోలు చేసే భక్తులతో ఈ ఇటుకలను తయారు చేయించేలా కార్యాచరణ రూపొందించడంపై దేవస్థానం ఈవో దామోదర్‌రావుతో చర్చించారు.

# ఆస్తులు పంచుకున్నారు కానీ.. తల్లిదండ్రులకు తిండి పెట్టడంలేదు



అక్కన్నపేట, నవంబరు12 (సందేశం టైమ్స్) : వృద్ధాప్యంలో ఆదరవుగా ఉంటారని నమ్మి ఆస్తి పంచి ఇస్తే, నేడు తమ బిడ్డలు కనీసం పట్టించుకోవడంలేదని సిద్దిపేట జిల్లాకు చెందిన వృద్ధ దంపతులు వాపోయారు. తిండిపెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తూ, ఇదేంటని ప్రశ్నిస్తే తండ్రిపైనే దాడి చేసిన ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది. మండల కేంద్రానికి చెందిన మిట్టపల్లి లక్ష్మి–వెంకటయ్య దంపతులకు సత్యనారాయణ, సదయ్య అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎంతో కష్టపడి వారిని ప్రయోజకుల్ని చేసి పెళ్లిళ్లు జరిపించిన తండ్రి, తను సంపాదించిన 8 ఎకరాల వ్యవసాయ భూమిని ఇద్దరికీ మూడు ఎకరాల చొప్పున పంచాడు. మిగతా రెండు ఎకరాలు తన పేరు మీద ఉంచుకున్నప్పటికీ, ఆ భూమిని సైతం కుమారులు అమ్మేశారు. తనకు తుంటి విరిగి అనారోగ్యం బారిన పడినా పట్టించుకోలేదని, చివరకు చేసేది లేక భార్య మెడలో బంగారం తాకట్టు పెట్టి ఆపరేషన్ చేయించాల్సిన దుస్థితి వచ్చిందని వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. చిన్న కుమారుడు పోస్టాఫీసులో ఉద్యోగం చేస్తుండడంతో ప్రభుత్వం నుంచి పింఛను కూడా రావడం లేదన్నాడు. కొడుకులు పంచుకున్న భూమిని తిరిగి తమ పేర్ల మీదకు మార్చాలని హుస్నాబాద్ ఆర్డీవో నుంచి నోటీసులు అందించినా పట్టించుకోవలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించిన్యాయం చేయాలని వృద్ధ దంపతులు కోరుతున్నారు.

# గొడుగుపల్లి అడవిలో చిరుత మృతి



దౌల్తాబాద్,నవంబరు12 (సందేశం టైమ్స్) :సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని గొడుగుపల్లి అటవీ ప్రాంతంలో అనారోగ్యంతో కదల్లేని స్థితిలో కనిపించిన చిరుతపులి మృతిచెందింది. మధ్యాహ్నం గొడుగుపల్లికి చెందిన భిక్షపతి అనే రైతు తన పొలం వద్దకు పశువులను మేపడానికి తీసుకెళ్తుండగా, పొదల్లో దాగి ఉన్న చిరుతపులి ఒక్కసారిగా దాడికి యత్నించింది. రైతు భయంతో కేకలు వేయడంతో పొదల్లోకి చేరింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని చిరుతను పరిశీలించారు. ఆ సమయంలో చిరుత అటూ ఇటూ కదలడం తప్ప లేచి పరుగు పెట్టలేని స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. అయితే, ఉదయం 7:30 గంటల సమయంలో ఆ చిరుత మృతిచెంది కనిపించింది. జిల్లా వెటర్నరీ అధికారి సంఘటనా స్థలానికి చేరుకుని శవపరీక్షలు నిర్వహించారు.న్యుమోనియా సోకడం వల్లే చిరుత మృతి చెంది ఉండవచ్చని డీఎఫవో కంప శ్రీనివాస్ అనుమానం వ్యక్తం చేశారు. మృతికి గల కచ్చితమైన కారణాలు తెలుసుకోవడానికి చిరుతపులి కళేబరంలోని కొన్ని కీలక భాగాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు ఆయన చెప్పారు.

(Sandesham Times) TG TEL/25/A0348“Title: Sandesham Times“Address: 3-82, Ananthagiri, Singavaram, Suryapet, Telangana – 508 206“Email:sandeshamtimes@gmail.com | Website: https://sandeshamtimes.com. Publisher & Printer: Amrutha Venkat Media Publication Private Limited,“3-82, Singaram, Ananthagiri Mandal, Suryapet District, Telangana – 508206“ Phone: 9052045435.“Printed at: Sunday Printing Press,“3-4297, Saraswathi Complex, SVN Colony, Guntur, Andhra Pradesh – 522 006